www.methukuseema news

Methuku Seema

# మెతుకు సీమ

నిత్యం - ప్రజల పక్షం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

హైదరాబాద్ | సంపుటి :01 | సంచిక :10 | సోమవారం | 28 అక్టోబర్ 2024




Published from : Hyderabad,Sanagareddy

పేజీలు :05 వేల : 5.00

# ఏటా సదర్ ఉత్సవాలు అధికారికంగా నిర్వహిస్తాం





- వారికి రానున్న రోజుల్లో పదవుల్లో మరిన్ని అవకాశాలు కల్పిస్తాం
- ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన సమ్మేళనంలో సీఎం రేవంత్ రెడ్డి
- వేడుకల సందర్భంగా సదర్ నృత్యంతో అలరించిన ముఖ్యమంత్రి
- యువకుడైన అనిల్ కుమార్ను రాజ్యసభకు పంపడం యాదవులపై సీఎంకు ప్రత్యేక దృష్టికి నిదర్శనం: మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్,అక్టోబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : సదర్ అంటే యాదవ సోదరుల ఖదర్ అని, ఇకపై ప్రభుత్వ అధికారిక వేడుకలా జరిపే సదర్ ఉత్సవాలను హైదరాబాద్ నుంచి గ్రామగ్రామాలకూ తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఎన్టీఆర్ గ్రౌండ్స్ లో జరిగిన సదర్ సమ్మేళనంలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. హైదరాబాద్ నగర అభివృద్ధిలో యాదవ సోదరుల పాత్ర కాదనలేనిది. నగరంలో సదర్ ఉత్సవాలు నిర్వహించడం రాష్ట్రానికి గర్వకారణం. హైదరాబాద్ నగరంలో యాదవ సోదరులు పశు సంపదను పెంచి పోషించారు. ఆనాడు మూసీ పరివాహక ప్రాంతాల్లో యాదవ సోదరులు పశుగ్రాసాన్ని పెంచుకునేవారు. మురికి కూపంగా మారిన మూసీకి పునరుజ్జీవం కల్పిద్దాం. ఈ నగరం అభివృద్ధి చేయడానికి యాదవ సోదరులు అండగా నిలబడండి. శ్రీకృష్ణుడు కూడా ధర్మం వైపు నిలబడ్డాడు. అందుకే కురుక్షేత్రంలో అధర్మం ఓడింది.. ధర్మం గెలిచింది. యాదవ సోదరులారా ధర్మం వైపు నిలబడండి.. అధర్మాన్ని ఒడిద్దాం. ఏ శక్తులు అడ్డొచ్చినా హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వమే తీసుకుంటుంది. మూసీ పరివాహక ప్రాంతవాసుల జీవన ప్రమాణాలను మెరుగు పరుస్తాం. యాదవులు రాజకీయంగా ఎదగాలనే యువకుడైన అనిల్ కుమార్ యాదవ్ ను రాజ్యసభకు పంపించాం. రాబోయే రోజుల్లో యాదవ సోదరులకు సముచిత స్థానం కల్పిస్తాం. సదర్ సమ్మేళనం వేడుకలో ముఖ్యమంత్రితో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, పలువురు ప్రజా ప్రతినిధులు, నేతలు పాల్గొన్నారు.


## మూసీ పేరుతో దోపిడీ జరుగుతోందని కేటీఆర్ ఆరోపణ



- మూసీ పునరుజ్జీవ పనులను కేసీఆర్ ఎప్పుడో ప్రారంభించారన్న కేటీఆర్
- మూసీ సుందరీకరణకు తాము వ్యతిరేకం కాదని స్పష్టీకరణ

హైదరాబాద్,అక్టోబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈరోజు మధ్యాహ్నం ఆయన నాచారంలోని ఎస్టీపీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్ నిర్మించిన ఎస్టీపీల వల్ల మురుగు నీటి శుద్ధి జరుగుతోందన్నారు. బీఆర్ఎస్ హయాంలో హైదరాబాద్‌లో మురుగు నీటి శుద్ధికి రూ.4 వేల కోట్లు కేటాయించినట్లు చెప్పారు. తమ హయాంలో నిర్మించిన ఎస్టీపీలను రేవంత్ రెడ్డి ప్రారంభించారన్నారు. కేసీఆర్ మూసీ పునరుజ్జీవ పనులు ఎప్పుడో ప్రారంభించారని, ఇప్పుడు కొత్తగా వచ్చి చేయాల్సిందేమీ లేదని విమర్శించారు. ఏ పథకం, అభివృద్ధి పనికి డబ్బులు లేవని మంత్రులు చెబుతున్నారని, మరి మూసీ పునరుజ్జీవానికి ఎక్కడి నుంచి వస్తున్నాయని ప్రశ్నించారు. మూసీ పునరుజ్జీవం ఎవరి కోసమని ప్రశ్నించారు. తాము మూసీ సుందరీకరణకు వ్యతిరేకం కాదని... ఆ పేరుతో జరుగుతున్న అవినీతికి వ్యతిరేకమని పేర్కొన్నారు. నిర్వాసితులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు.

## కాంగ్రెస్ సర్కారుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఫైర్



హైదరాబాద్,అక్టోబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల ఫాంహౌస్ పై పోలీసులు దాడులు, ఎక్సైజ్ శాఖ తనిఖీలకు యత్నించిన నేపథ్యంలో, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్ రెడ్డిపై ధ్వజమెత్తారు. కేటీఆర్ ను తప్పుడు కేసులో ఇరికించేందుకు రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఫాంహౌస్ లో నిర్వహించిన పార్టీలో కేటీఆర్ భార్య శైలిమ కూడా ఉన్నారన్నది అవాస్తవం అని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, డాక్టర్ కె.సంజయ్, జి.శ్రీనివాస్ యాదవ్, సతీశ్ రెడ్డి ఇవాళ మీడియాతో మాట్లాడారు. కేటీఆర్ కుటుంబంపై వచ్చిన ఆరోపణలను ఖండిస్తున్నట్టు తెలిపారు. ఎన్నికల హామీలు అమలు చేయడంలో తమ వైఫల్యం నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే ప్రభుత్వం ఈ విధంగా తప్పుడు ఆరోపణలు చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ధ్వజమెత్తారు. కేటీఆర్ ను అప్రదిష్ఠపాల్జేసేందుకు యత్నిస్తున్నారని, ఆయనను మానసిక వేధింపులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల్లో కేటీఆర్ కు ఉన్న పాప్యులారిటీని అధికార కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతోందని అన్నారు. ఓవైపు కేటీఆర్ కు ప్రజాదరణ అంతకంతకు పెరుగుతుండడం, మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రజల్లో ఆదరణ తగ్గిపోతుండడం కాంగ్రెస్ వర్గాలకు మింగుడుపడడంలేదని పేర్కొన్నారు. అంతేకాకుండా, రేవంత్ రెడ్డి కూడా కేటీఆర్ పట్ల అసూయతో రగిలిపోతున్నారని, అందుకే ఆయనపై వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రస్తుతం కేటీఆర్ ఫోబియాతో బాధపడుతున్నారని ఎద్దేవా చేశారు.

## మూసీ ప్రక్షాళనను అడ్డుకుంటే ప్రజలు తిరగబడతారు



హైదరాబాద్,అక్టోబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : మురికి కూపం నుంచి రక్షణ కల్పిస్తామని ప్రభుత్వం చేస్తుంటే, ప్రతిపక్షాలు మురికి ప్రచారం చేస్తున్నాయని భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావులు అడ్డుపడినా మూసీ ప్రక్షాళన ఆగదని కాంగ్రెస్ నేతలు తేల్చి చెప్పారు. దమ్ముంటే మూసి ప్రక్షాళనపై చర్చకు రావాలని బీఆర్ఎస్, బీజేపీ నాయకులకు కాంగ్రెస్ నేతలు సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన మూసీ ప్రక్షాళన కార్యక్రమాన్ని అడ్డుకుంటే ప్రజలు తిరగబడతారని వారు హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన మూసీ పునర్జీవనానికి మద్దతుగా అడ్డగూడూరు మండలం మానాయికుంట వద్ద కాంగ్రెస్ ప్రజా చైతన్య యాత్రను నిర్వహించింది. ఈ యాత్రలో భువనగిరి పార్లమెంటుసభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశం పాల్గొన్నారు. వేలాది మందితో కలిసి మానాయకుంట నుంచి మూసీ బ్రిడ్జి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. మూసీ ప్రక్షాలను కొనసాగించాలని ప్లకార్డులతో రైతులు ర్యాలీలో పాల్గొన్నారు. మూసీ నదిలో కలిసే వ్యర్థాలు, కలుషితాలతో పరివాహక ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్లుగా అధికారంలో ఉండి బీఆర్ఎస్ మూసీ ప్రక్షాళన చేయలేదని.. ఇసుక ప్రక్షాళన మాత్రమే చేశారని కాంగ్రెస్ నేతలు విమర్శించారు. ఎవరు అడ్డుపడిన మూసీ ప్రక్షాళన మాత్రం ఆగదని కాంగ్రెస్ నేతలు స్పష్టం చేశారు. మూసీ పునర్జీవంపై ప్రతిపక్షాలు చేస్తున్న

2 లో

# మూసీ ప్రక్షాళనను అడ్డుకుంటే ప్రజలు తిరగబడతారు

మొదటిపేజీ తరువాయి దుష్ప్రచారం తిప్పి కొట్టాలని పిలుపు ఇచ్చారు.మురికి కూపం నుంచి రక్షణ కల్పిస్తామని ప్రభుత్వం చేస్తుంటే, ప్రతిపక్షాలు మురికి ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. రాజకీయ స్వార్థంతో ప్రతిపక్షాలు మూసీ పునర్జీవం ను రాజకీయం చేయడం సరికాదని అన్నారు. మూసీ పునర్జీవనంపై ప్రజల మద్దతు కోసం పెద్ద ఎత్తున సదస్సులు నిర్వహిస్తామని కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. లక్ష మంది రైతులతో బహిరంగ సభలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, బీజేపీ నేతలు ఇక్కడనేమో రాజకీయం , ఢిల్లీలో గొప్పలు చెప్తున్నారని ఎంపీ చామల అన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసింది.. మూసీ ప్రక్షాళన కాదు.. ఇసుక ప్రక్షాళన అని ఎమ్మెల్యే మందుల సామేల్ విమర్శించారు. మూసీ ప్రక్షాళన అడ్డుకుంటే ప్రతిపక్ష పార్టీలపై తిరగబడతామని ఆయన హెచ్చరించారు. మూసీ నదిని ప్రక్షాళన చేయకుండా బీఆర్ఎస్ నేతలు ఇసుకతో కోట్లకు పడగలెత్తారని ఆరోపించారు. రాజకీయ స్వార్థంతో ప్రతిపక్షాలు మూసీ ప్రక్షాళనలను రాజకీయం చేస్తున్నాయని ధ్వజమెత్తారు.

# నిన్నటితో ముగిసిన టీజీపీఎస్సీ గ్రూప్ 1 మెయిన్స్



హైదరాబాద్,అక్టోబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : పలు వివాదాల నడుమ ప్రారంభమైన తెలంగాణ గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు నేటితో ముగిశాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో మొత్తం 46 పరీక్ష కేంద్రాల్లో అక్టోబర్ 21వ తేదీ నుంచి గ్రూప్ 1 పరీక్షలు ప్రారంభమయ్యాయి. పోలీలసుతోపాటు పాటు జిల్లా కలెక్టర్లు పటిష్ట భద్రత ఏర్పాటు చేసి, సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించారు. గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు మొత్తం 7 పేపర్లకు జరిగాయి. అక్టోబర్ 21 నుంచి అక్టోబర్ 27వ తేదీ వరకు అన్ని పేపర్ల పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించారు. చివరి రోజైన ఈ రోజు తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఏర్పాటుపై పరీక్ష జరిగింది. ఇక నిన్న నిర్వహించిన సైన్స్ అండ్ టెక్నాలజీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ పరీక్షకు మొత్తం 31,383 మందికి గానూ కేవలం 21,181 మంది మాత్రమే పరీక్ష రాశారు. అంటే 67.4 శాతం మంది అభ్యర్థులు హాజరైనట్టు టీజీపీఎస్సీ అధికారులు తెలిపారు. గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షల్లో భాగంగా శనివారం జరిగిన సైన్స్ అండ్ టెక్నాలజీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ ప్రశ్నలు కఠినంగా ఉన్నట్లు పలువురు అభ్యర్థులు తెలిపారు. దీంతో ప్రశ్నలకు సమాధానాలు రాసేందుకు అభ్యర్థులు నానాతంటాలు పడ్డారు. ఒక్కో ప్రశ్న అర్థం చేసుకోవడానికే 2 నుంచి 3 నిమిషాల సమయం పట్టిందని, అయినా కొన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయలేకపోయామని తెలిపారు. అటు గణితం సబ్జెక్టు అభ్యర్థులు సైతం ఈ పేపర్ రాసేందుకు ఇబ్బందులు పడ్డారు. ఈ పేపర్ ప్రభావం గ్రూప్ 1 ఎంపికపై పడుతుందని అభ్యర్థులు ఆందోళన పడుతున్నారు. మొత్తం 7 పేపర్లలో శుక్రవారం నాటి పేపర్ అత్యంత కఠినంగా ఉందని అభ్యర్థులు చెప్పారు. ఇక శనివారం షేక్‌పేటలోని నారాయణమ్మ ఇంజినీరింగ్ కాలేజీలో ఓ అభ్యర్థి కాపీయింగ్‌కు పాల్పడగా అధికారులు ఆ అభ్యర్థిని డిబార్ చేశారు. ఈ రోజు రాసిన పరీక్ష ఎలా ఉందనేది తెలియాల్సి ఉంది. మొత్తంగా గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలకు సగటున 26 శాతం మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. అందువల్లనే 7 పేపర్లలో ఏ రోజున కూడా 70 శాతానికి హాజరు నమోదుకాలేదు. వాళ్లంతా కష్టపడి ప్రిలిమ్స్ రాసి, మెయిన్స్‌కి క్వాలిఫై అయిన వాళ్లే. అయినా పరీక్షలకు భారీగా అభ్యర్థులు డుమ్మా కొట్టారు. దీంతో గ్రూప్ 1 పోస్టులకు పోటీ తగ్గే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.


# జన్వాడ ఫామ్‌హౌస్‌లో రేవ్ పార్టీ.. తెలంగాణ రాజకీయాల్లో డ్రగ్స్ ప్రకంపనలు



హైదరాబాద్,అక్టోబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : జన్వాడ రేవ్ పార్టీ కేసులో 2గా ఉన్న రాజ్ పాకాల ఇంట్లో సోదాలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు ఎక్సైజ్ అధికారులు. రేవ్ పార్టీలో ఇప్పటివరకు డ్రగ్స్ దొరకనట్లుగా ఆనవాళ్లు లేవని.. అక్కడ దొరికిన అక్రమ మద్యం ఎలా వచ్చిందనే దానిపై ఆరా తీస్తున్నామని తెలిపారు. కేసులో ఏ-2గా ఉన్న రాజ్ పాకాల ప్రస్తుతం పరారీలో ఉన్నారన్నారు. ఓ వీకెండ్ పార్టీ ఇప్పుడు పొలిటికల్‌గా హాట్ టాపిక్ అయ్యింది.. హైదరాబాద్ శివారు జన్వాడలో జరిగిన రేవ్ పార్టీ జరగడం.. తెలంగాణలో ప్రకంపనలు సృష్టిస్తోంది.. పార్టీలో పాల్గొన్న వాళ్లలో డ్రగ్స్ తీసుకున్నట్టు తేలింది ఒకరే అయినా.. హైప్రొఫైల్ కేసు కావడంతో.. ఈ న్యూస్ బయటకు రావడం ఆలస్యం రాజకీయంగానూ విమర్శలు మొదలయ్యాయి.. శనివారం రాత్రి హైదరాబాద్ శివారు జన్వాడలో ఓ రేవ్ పార్టీ జరిగింది.. రాజ్ పాకాలకు చెందిన ఈ ఫామ్‌హౌస్‌లో పార్టీకి 35 మంది హాజరయ్యారు. ఈ పార్టీపై పోలీసులకు నిన్న రాత్రి ఫిర్యాదు అందడంతో.. నార్సింగి పోలీసులు, సైబరాబాద్ SOT బృందాలతోపాటు ఎక్సైజ్ పోలీసులు ఫామ్‌హౌస్‌కి వెళ్లి తనిఖీలు చేశారు. అక్కడ హై ఫై పార్టీ జరుగుతున్నట్టు గుర్తించారు. పార్టీలో ఉన్న వారికి డ్రగ్స్ టెస్టు చేస్తే.. విజయ్ మద్దూరికి కొకైన్ పాజిటివ్ వచ్చింది. ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. పార్టీలో అనుమతి లేని విదేశీ మద్యం, గేమింగ్ కాయిన్స్, క్యాసినో మెటీరియల్ గుర్తించారు.. రాజ్‌పాకాలపై NDPS, ఎక్సైజ్ యాక్ట్ ప్రకారం చేవెళ్ల పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. రేవ్‌పార్టీ కేసులో A1-గా కార్తీక్.. A-2గా రాజ్ పాకాల పేర్లను చూపించారు. హైదరాబాద్ శివారు జన్వాడ ఫామ్‌హౌస్‌లో జరిగిన రేవ్ పార్టీకి 35 మంది హాజరయ్యారు.. వీరిలో 14 మంది మహిళలు కూడా ఉన్నారు.. పార్టీలో డ్రగ్స్ ఆనవాళ్లు కనిపించడంతో స్నిఫర్ డాగ్స్‌ను కూడా రంగంలోకి దించి పూర్తి స్థాయిలో తనిఖీలు చేశారు.. ఫామ్‌హౌస్‌లో 10 లీటర్ల అనుమతిలేని ఫారిన్ లిక్కర్ , 10 ఇండియన్ మేడ్ లిక్కర్ బాటిల్స్ సీజ్ చేశారు.. జన్వాడలో పార్టీకి ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ నుంచి ఎలాంటి పర్మిషన్ లేదని పోలీసులు తెలిపారు. %చీణూూ% యాక్ట్ కింద కేసులు నమోదు చేశారు. పార్టీకి హాజరైన వారిలో ప్రముఖులు ఉన్న నేపథ్యంలో ఇప్పుడీ రేవ్ పార్టీ కేసు సంచలనంగా మారింది. దీనిపై బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నేతలు ఫైర్ అవుతున్నారు.. బావమరిది ఫామ్‌హౌస్‌లో రేవ్‌పార్టీలా అంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ సూటిగా ప్రశ్నలు సంధించారు.. అసలైన వ్యక్తిని తప్పించారని వార్తలొస్తున్నాయంటూ కూడా సెటైర్లు వేశారు.. కాంగ్రెస్, BRS కాంప్రమైజ్ పాలిటిక్స్ సిగ్గుచేటు అంటు ఆగ్రహం వ్యక్తం చేసిన బండి సంజయ్.. దర్యాప్తు పక్కాగా జరగాల్సిందేనన్నారు.. డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపాలంటూ బండిసంజయ్ సూచించారు.ఓ కీలక నేత బావమరిది ఫామ్‌హౌజ్‌లో అసాంఘిక కార్యకలాపాలను చూస్తే.. తెలంగాణ సమాజం సిగ్గుపడుతోందంటూ కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్ పేర్కొన్నారు. డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ అని ప్రభుత్వం అంటుంటే.. తన సొంత బావమరిది ఫామ్‌హౌస్‌లోనే రేవ్‌పార్టీలు జరుగుతున్నాయంటూ మండిపడ్డారు. సోదాలకంటే ముందే 20 మంది వెళ్లిపోయారని సమాచారముందని.. తెలంగాణ సమాజానికి ఏమని సందేశం ఇస్తున్నారంటూ అద్దంకి దయాకర్ ఫైర్ అయ్యారు.

# జర్నలిస్టుల రక్షణకు చట్టాన్ని తీసుకురావాలి

## - కేంద్రాన్ని కోరిన ప్రెస్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా




న్యూ ఢిల్లీ,అక్టోబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : న్యూఢిల్లీ దేశంలో జర్నలిస్టుల భద్రత రక్షణ కోసం ఒక చట్టాన్ని తీసుకురావాలని కేంద్రాన్ని ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) కోరింది. దేశంలో మీడియా సిబ్బంది అరెస్టులు తప్పుడు నిర్బంధాలు బెదిరింపు లపై ప్రెస్ కౌన్సిల్ సభ్యులు గుర్బీర్‌సింగ్ రూపొందించిన నివేదికను పీసీఐ ఆమోదించింది. అయితే కౌన్సిల్ చైర్‌పర్సన్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి రంజన్ ప్రకాశ్ దేశాయ్ నుంచి ఈ విషయంలో భిన్నాభిప్రాయం వ్యక్తమైనప్పటికీ నివేదికకు సమర్థన లభించటం గమనార్హం. ఈ నివేదిక కేంద్రానికి ప్రధానంగా మూడు ప్రతిపాదనలను చేసింది.అందులో మొదటిది.. దేశంలో జర్నలిస్టుల రక్షణ భద్రత కోసం జాతీయ చట్టాన్ని ప్రకటించటం. అలాగే, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా యాక్ట్‌కు మరిన్ని అధికారాలు కలిగించాలనీ, ఫోర్త్ ఎస్టేట్‌గా పిలవబడే మీడియాతో వ్యవహరించే విధానంపై పోలీసులకు అవగాహన కల్పించటం చట్టాన్ని అమలు పరిచే సంస్థల ప్రవర్తన నిబంధనలను క్రోడీకరించాలని నివేదిక పేర్కొన్నది.

# ఇక ఇంటి వద్దకే ఆర్టీసీ కార్గో సేవలు




హైదరాబాద్ బ్యూరో,అక్టోబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : హైదరాబాద్:అక్టోబర్ 27 ఆర్టీసీ ఆదాయాన్ని పెంచుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. కార్గోలో బుక్ చేసిన వస్తువులను వినియోగదారులకు ఇంటి వద్దకే అందించే సౌకర్యం ఈరోజు నుండి కల్పించ నున్నారు. పైలెట్ ప్రాజెక్టుగా నేటి నుంచి హైదరాబాద్ లో హోండెలివరికి శ్రీకారం చుట్టనున్నారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ విషయాన్ని వెల్లడించారు. హైదారాబాద్ లోని 31 ప్రాంతాల నుంచి హోం, డెలివరి సేవలు అందు బాటులో ఉంటాయని తెలిపారు. టీజీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ సెంటర్స్ నుంచి హైదారాబాద్ లో ఎక్కడికైనా హోండెలివరి చేయవచ్చని చెప్పారు. రాబోయో రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా హోం డెలివరి సేవలు అందించే విధంగా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజలు హోం,డెలివరి సదుపాయాన్ని వినియోగిం చుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచించారు.

# ఉద్యోగాల నుంచి తప్పించిన టీజీఎస్పీ



హైదరాబాద్,అక్టోబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : సమస్యలు పరిష్కరించాలంటూ రోడ్డెక్కిన పోలీసు సిబ్బందిపై ఉన్నతాధికారులు కఠిన చర్యలకు ఉపక్రమించారు. నిరసనల పేరుతో నిబంధలకు విరుద్ధంగా వ్యవహరించారంటూ 39 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను శనివారం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఆదివారం ఓ ఏఆర్ ఎస్సై, మరో హెడ్ కానిస్టేబుల్ సహా ఏకంగా 10 మందిని ఉద్యోగాల నుంచి తొలగిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. క్రమశిక్షణగా ఉండాల్సిన పోలీసు శాఖలో నిబంధనలకు విరుద్ధంగా నిరసనలు తెలిపారన్న కారణంతో వీరిని తొలగిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర స్పెషల్ పోలీస్ (టీజీఎస్పీ)లో సెలవులతోపాటు ఇతర అంశాలకు సంబంధించి అదనపు డీజీపీ ఇటీవల జారీ చేసిన సర్క్యులర్‌ను వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని బెటాలియన్ల సిబ్బంది, కుటుంబ సభ్యులు నిరసనలకు దిగారు. ఆర్డర్లీ వ్యవస్థ, సెలవులు ఇవ్వకపోవడం, ఇతర సమస్యలను పరిష్కరించాలంటూ రాష్ట్రవ్యాప్తంగా రోడ్డెక్కి నిరసన తెలిపారు. ఈ క్రమంలో కొందరు పరిధి దాటి వ్యవహరించినట్లు పోలీసు శాఖ అంతర్గత విచారణలో తేల్చారు. దీంతో ఉన్నతాధికారులు సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఇబ్రహీంపట్నంలోని 3వ బెటాలియన్‌లో కానిస్టేబుల్ జి.రవికుమార్‌బీ భద్రాద్రి కొత్తగూడంలోని ఆరో బెటాలియన్‌లో కానిస్టేబుల్ కె.భూషణ్‌రావుబీ అన్నెపర్తి 12వ బెటాలియన్‌లో హెడ్ కానిస్టేబుల్ వి.రామకృష్ణ, కానిస్టేబుల్ ఎస్.కె.షఫీబీ సిరిసిల్లలోని 17వ బెటాలియన్‌లో ఏఆర్ ఎస్సై సాయిరామ్‌బీ కానిస్టేబుళ్లు కె.లక్ష్మీనారాయణ, ఎస్.కరుణాకర్‌రెడ్డి, టి.వంశీ, బి.అశోక్, ఆర్.శ్రీనివాసలను విధుల నుంచి తప్పించారు. వీరందరిపై ఆర్టికల్ 311(2)(బి) ప్రకారం చర్యలు తీసుకున్నట్లు ఉన్నతాధికారులు ప్రకటించారు. నిరసనల పేరుతో బెటాలియన్లలో చోటుచేసుకున్న పరిణామాలపై విచారణ కొనసాగుతోందని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. నిరసనలు తెలిపిన మరికొందరిపైనా చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలిసింది. బెటాలియన్ సిబ్బంది తమ సమస్యలను దర్బార్లలో అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఉన్నతాధికారులు సూచించారు.

# ముంపు నుంచి బెంగళూరును కాపాడేందుకు కర్ణాటక ప్రభుత్వం కీలక నిర్ణయం



హైదరాబాద్,అక్టోబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : ఇటీవల కురిసిన భారీ వర్షానికి బెంగళూరులోని హెన్నూరులో నిర్మాణంలో ఉన్న ఓ భవనం కూలి 8 మంది కూలీలు ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అనధికారికంగా, నాసిరకంగా కట్టిన భవనాలను కూల్చివేసేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నట్టు తెలిపింది. ముంపు నుంచి నగరానికి శాశ్వత పరిష్కారంపై మాట్లాడుతూ వరద కాలువలు నిర్మిస్తామని, వాటి వెంబడి ఉన్న రోడ్లను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. తొలి విడతలో ఇలాంటి రోడ్లను 300 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు.

# పుస్తె మెట్టెలు అందజేసిన ఏవిఆర్ ఫౌండేషన్



హత్నూర,అక్టోబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : సంగారెడ్డి జిల్లా హత్నూర మండల పరిధిలోని కాసాల గ్రామానికి చెందిన దండు శంకర్ పద్మల, కూతురు వాణి, వివాహానికి ఏవిఆర్ ఫౌండేషన్ చైర్మన్ శరత్ చంద్ర పుస్తె మెట్టెలను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఏవిఆర్ ఫౌండేషన్ ద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేయడంతో పాటు పేదింటి వధువు ఆడపడుచులకు మా పెద్దల జ్ఞాపకార్థం పుస్తె మేట్టలను అందజేయడం ఎంతో సంతోషంగా ఉందని ఆయన అన్నారు. సేవ చేయడంలో ఉన్నటువంటి తృప్తి దేనిలో లేదని, మానవసేవే మాధవసేవ అనే నినాదంతో కార్యక్రమాలు చేయడం జరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో చెలిమిటి బాలయ్య, చెరువుముంగటి లింగేశ్వర్, రాములు, ఏవిఆర్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

---

# ఏ.ఎన్.ఎం లను అందరిని రెగ్యులర్ చేయాలి

**- ఏ.ఎన్.ఎం లను రెగ్యులర్ చేయకపోతే ప్రభుత్వం పతనం తప్పదు సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎం యాదగిరి**



సంగారెడ్డి బ్యూరో,అక్టోబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న రెండవ ఏఎన్ఎంలు, ఈ.సీ.ఎ ఎన్.ఎంలు, అర్బన్ హెల్త్ సెంటర్స్ ఏ.ఎన్.ఎంలు, వైద్య విధాన పరిషత్ ఏఎన్ఎంలు, హెచ్.ఆర్డి ఏఎన్ఎంలు ఇతర అన్ని రకాల ఏ.ఎన్.ఎంలను యధావిధిగా రెగ్యులర్ చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ మధ్యలో వైద్య ఆరోగ్యశాఖలోని కొంత మందిని రెగ్యులర్ చేయడం హర్షించదగ్గ విషయమే కాని అదే సందర్భంలో మెజార్టీ ఉద్యోగులను విస్మరించడం అత్యంత దుర్మార్గమని, ప్రభుత్వం వెంటనే అందరిని బేషరతుగా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. వైద్య ఆరోగ్య రంగానికి బలమైన ఆయువు పట్టుగా ఉండి క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఏ.ఎన్.ఎంలు రెండు దశాబ్దాలుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న నేటికీ రెగ్యులర్ కాకపోవడం అత్యంత దుర్మార్గమని అన్నారు. వెంటనే 2వ ఏ.ఎన్.ఎం లను అందరిని రెగ్యులర్ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

---

# 6000 మంది ప్రభుత్వ ఉద్యోగులకు రిటైర్మెంట్ డబ్బులు వెంటనే చేల్లించాలి

**- ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ మూడు సంవత్సరాల తర్వాతే చెల్లిస్తాం అనడం దుర్మార్గం.**


**- ఒక డీఏ మాత్రమే ప్రకటించి ప్రభుత్వ ఉద్యోగులను నిరాశపరిచారు.**

**- బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 15 డీఏలను ఉద్యోగులకు ఇచ్చాము.**



సిద్దిపేట స్టాఫ్ రిపోర్టర్,అక్టోబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : తెలంగాణ ప్రభుత్వం రిటైర్డ్ అయిన 6000 మంది ఉద్యోగులకు వెంటనే డబ్బులు చెల్లించాలని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రభుత్వాని డిమాండ్ చేశారు. సిద్దిపేటలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసి పదవీ విరమణ పొందిన మన్మోహన్ వీడ్కోలు కార్యక్రమానికి ముఖ్యతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ :పదవీ విరమణ పొందిన మన్మోహన్‌కు శుభాకాంక్షలు. మన్మోహన్ నాకు కేసీఆర్ కుటుంబానికి ఎంతో ఆత్మీయులు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసిన వారి జీతాల నుండి కొంత భాగాన్ని కట్ చేసి, ప్రభుత్వం రిటైర్డ్ అయినప్పుడు ఇచ్చే మీ రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వడం లేదని అయన అన్నారు. రిటైర్మెంట్ అయిన చివరిరోజే రిటైర్మెంట్ డబ్బులు ఇవ్వాలి కానీ, ఇప్పుడు రెండు, మూడు సంవత్సరాలు అయినా అందే పరిస్థితి లేదన్నారు. డీఏలు కూడా రెండు వస్తాయేమో అనుకుంటే కేవలం ఒక్క డీఏ మాత్రమే ఇచ్చి ప్రభుత్వ ఉద్యోగులను ఈ ప్రభుత్వం నిరాశపరిచింది అన్నారు. .గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో 15 డీఏలను ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 6,000 మంది ఉద్యోగులు రిటైర్ అయ్యారు. కానీ వారికి కాంగ్రెస్ ప్రభుత్వం రిటైర్మెంట్ డబ్బులు ఇంకా ఇవ్వలేదన్నారు. ఉద్యోగుల 20, 30 సంవత్సరాల కష్టార్జితాన్ని రిటైర్మెంట్ సమయంలో ప్రభుత్వం ఇవ్వకపోవడం దురదృష్టకరం ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రిటైర్మెంట్ అయిన చివరిరోజే రిటైర్మెంట్ డబ్బులు ఉద్యోగుల చేతికి వచ్చేది. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఎప్పుడు వస్తాయో కూడా తెలియని పరిస్థితి నెలకొన్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా ఉద్యోగులకు ఇవ్వాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను వెంటనే విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాని డిమాండ్ చేశారు.

# నేడు సి డి సి చైర్మన్ గా నియామక పత్రం అందుకోనున్న అసద్ గంజ్ మాజీ సర్పంచ్ ముబీన్



జహీరాబాద్,అక్టోబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం అసద్ గంజ్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మహమ్మద్ అబ్దుల్ ముబీన్ ను సి డి సి చైర్మన్‌గా నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకొందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. అందులో భాగంగా సోమవారం హైదరాబాదులో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజా నర్సింహా చేతుల మీదుగా మహమ్మద్ ముబీన్ సి డి సి చైర్మన్ గా నియామక పత్రాని అందుకోనున్నారు. గతంలో 5 సార్లు సర్పంచ్‌గా, 1 సారీ ఏకగ్రీవంగా సర్పంచ్‌గా, 3 సార్లు జహీరాబాద్ తాలుక సర్పంచ్ ఫోరం అధ్యక్షులుగా అలాగే బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా పదవులు చేపట్టారు. అయన కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను గుర్తించి కాంగ్రెస్ అధిష్టానం ఆయనకు సి డి సి చైర్మన్గా నియమిస్తూ తీసుకొన్న నిర్ణయం పట్ల నియోజకవర్గం పరిధిలో అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

---

# దీపావళి లోపు కార్మికులందరికీ బోనస్ చెల్లించాలి

**- చెల్లించన పరిశ్రమల వద్ద ఆందోళన**

**- సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు కే రాజయ్య**



పఠాన్ చేరు,అక్టోబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : దీపావళి పండుగలోపు కార్మికులందరికీ బోనసు చెల్లించాలని, బోనస్ చెల్లించని పరిశ్రమల వద్ద ఆందోళన చేస్తామని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు కే రాజయ్య హెచ్చరించారు. నిన్న గుమ్మడిదలకు వచ్చిన సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1965 బోనస్ చట్ట ప్రకారం కార్మికులందరికీ బోనస్ చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.. పర్మనెంట్ , క్యాజువల్, ఫిక్స్, కాంటాక్ట్ కార్మికులు అందరికీ ఖచ్చితంగా బోన చెల్లించాలని చట్టము చెబుతుందని అన్నారు. సంవత్సరంలో 30 రోజులు పని చేస్తే చాలని అన్నారు, 30 రోజులు పని చేస్తే బోనస్ చెల్లించాలని ఆయన అన్నారు, కానీ జిల్లాలో చాలా పరిశ్రమలలో బోనస్ ఎగ్గొట్టడం కోసం యజమానులు కుట్రలు చేస్తున్నారని ఆయన అన్నారు. బోనస్ ఎగ్గొట్టడం కోసం అనేక ప్రయత్నాలు చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని ఆయన హెచ్చరించారు. బోనస్ చెల్లించడానికి లాభ నష్టాలకు సంబంధం లేదని అన్నారు, పరిశ్రమలు ఎక్కడైనా నష్టాలలో నడుస్తున్నాయని ఆయన ప్రశ్నించారు, మరి లాభాలు వచ్చినప్పుడు కార్మికులకు వాట ఎందుకు పంచట్లేదని ఆయన అన్నారు, బోనస్ ఎగ్గొట్టడం కోసం యజమానులు కంపెనీ లాస్ లో ఉందని చెప్తున్నారు. లాస్ లో ఉన్న కచ్చితంగా బోనస్ చెల్లించాలని, దానికి చట్టం ఉందని ఆయన అన్నారు. కార్మికులను దోచుకోవడం తప్ప వేరే ఆలోచన లేదని ఆయన అన్నారు. పరమెంటు కార్మికులకు తో సహా అన్ని రకాల కార్మికులకు కచ్చితంగా బోనస్ చెల్లించాలని అన్నారు. కనీసం బోనస్ చెల్లించకుండా కాలయాపన చేయడం దుర్మార్గమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు, దేశంలోనే పెద్ద పండుగలు దీపావళి, దసరా అని అన్నారు, ఇటువంటి పండుగలకు కూడా బోనస్ చెల్లించకపోతే ఎలా అని అన్నారు, ఎక్కడైనా బోనస్ చెల్లించకపోతే సిఐటియు నాయకులను సంప్రదించాలని ఆయన కోరారు, బోనస్ చెల్లించకపోతే దీపావాళి తర్వాత పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు శ్రీధర్ రావు, భాస్కర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకటేష్ గౌడ్, రవి తదితరులు పాల్గొన్నారు.

---

# దశ దినకర్మలో పాల్గొన్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సంగారెడ్డి బ్యూరో,అక్టోబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : చిద్రుప్పా మాజీ సర్పంచ్ తాళ్ళ నరసింహా గౌడ్ తల్లి తాళ్ళ వీరమ్మ దశదిన కర్మ కార్యక్రమానికి సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పాల్గొని వీరమ్మ చిత్రపటానికి పూలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కొండల్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఆర్. వెంకటేశ్వర్లు , మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభాకర్ ,విఠల్ తదితరులు ఉన్నారు.

---

# అర్హత కలిగిన పట్టభద్రులందరూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి

**- హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఉమ్మడి మెదక్ జిల్లా అద్యక్షుడు మెట్టుశ్రీధర్**



సంగారెడ్డి బ్యూరో,అక్టోబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : రాష్ట్రంలో త్వరలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఉమ్మడి మెదక్ జిల్లా అద్యక్షుడు మెట్టుశ్రీధర్ తెలిపారు. పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలోని పట్టభద్రులు, తమ ఓటు ద్వారా ఎమ్మెల్సీని ఎన్నుకోవాల్సి ఉంది. చివరి తేదీ నవంబరు 6 సమీపిస్తున్నా పట్టభద్రులు, ఓటు హక్కు కోసం దరఖాస్తు చేయడంలో వెనకబడిపోతున్నారని అన్నారు. అర్హత కలిగిన పట్టభద్రులందరూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఉమ్మడి మెదక్ జిల్లా అద్యక్షుడు మెట్టుశ్రీధర్ కోరడం జరిగింది. 2021 అక్టోబరు 31వ తేదీ నాటికి డిగ్రీ పూర్తి చేసినవారు పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్లుగా నమోదు దరఖాస్తు చేసుకోవచ్చని ఎన్నికల కమిషన్? రూపొందించిన ఫాం-18 పూరించి నేరుగా తహసీల్దార్ కార్యాలయంలో అందజేసిన లేదా ఆన్లైన్ లో కూడా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

# న్యూల్యాండ్ పరిశ్రమలో కార్మికులకు చారిత్రాత్మక వేతన ఒప్పందం

- పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులకు అండగా సిఐటియు ఎర్ర జెండా
- సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు





గుమ్మడిదల,అక్టోబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : గుమ్మడిదల మండల పరిధిలోని బొంతపల్లి పారిశ్రామిక వాడలోని న్యూలాండ్ పరిశ్రమ సిఐటియు సంఘం నాయకులు కార్మికులు చరిత్రత్మకమైన వేతన ఒప్పందం జరిగిన సందర్భంగా అభినందన సభ ఏర్పాటు చేసి ముఖ్య అతిథులుగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు, యూనియన్ అధ్యక్షులు చుక్క రాములు, జిల్లా అధ్యక్షులు బిరం మల్లేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు కే రాజయ్య, హెచ్ ఆర్ జిఎం రవి, హెచ్ఆర్ లు లక్ష్మణ్, ప్రసాద్, హాజరయ్యారు ఈ సందర్భంగా రాష్ట్ర పరిశ్రమ యూనియన్ అధ్యక్షులు సుక్క రాములు మాట్లాడుతూ కార్మికుల ఐక్యతతోనే చరిత్రాతకమైన వేతన ఒప్పందం జరుపుకున్నామని తమపై విశ్వాసంతో ఉన్న కార్మికులందరికి జేజేలు తెలిపారు. 14 వేలు ఇతర అనేక సౌకర్యాల వేతన ఒప్పందంలో సాధించడం డిఏ పెంచడం, రిటైర్మెంట్ బెనిఫిట్ లు, అనేక కొత్త, కొత్త సౌకర్యాలు సాధించుకోవడం జరిగిందన్నారు. పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులు ప్రతి ఒక్కరూ సిఐటియు ఎర్రజెండా సంఘంలో చేరి తమకు రావలసిన కనీస వేతనాలను ఇచ్చేలా పరిశ్రమ యాజమాన్యాలతో మాట్లాడి సాధించుకుందామని సూచించారు. న్యూల్యాండ్ పరిశ్రమ వేతన ఒప్పందం చేసుకున్న సందర్భంగా నాయకులు కార్మికులు అభినందన సభను ఏర్పాటు చేసి తమను పుష్పగుచ్ఛం శాలువా మేమెంటోలతో సత్కరించడం అభినందనీయమని అన్నారు కార్యక్రమంలో జగన్నాథ్ పరిశ్రమ సిఐటియు యూనియన్ జనరల్ సెక్రెటరీ ఎస్ వెంకటేష్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్, జి శ్రీధర్ రావు, జాయింట్ సెక్రటరీ, టి నరసింహా గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఎస్ దేవేందర్, ట్రెజరర్ బి రవి. ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు, ఎన్ వీరేశం, డి హుస్సేన్, బి గోపాల్ రెడ్డి, ఏ కృష్ణయ్య. కార్మిక సోదరులు తదితరులు పాల్గొన్నారు.

---

## పారిశుధ్య పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్



నర్సాపూర్,అక్టోబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో మ్యానువల్ పనులను మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్ పరిశీలించారు. అదేవిధంగా డ్రైనేజీ. వీధి దీపాలు. మిషన్ భగీరథ నీటి పై కాలనీలో సక్రమంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. .ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పంబాల లలిత. పంబాల రామచంద్ర, మున్సిపల్ మేనేజర్ మధుసూదన్, సబ్ ఇంజనీరింగ్ భూపాల్, శానిటైజర్ ఇన్స్పెక్టర్ చల్ల మురళి, వాటర్ సప్లై వర్క్ ఇన్స్పెక్టర్ వినీత్ రాజ్, వార్డ్ ఆఫీసర్స్ శోభ రాణి, రాములు, ఉదయ్ జవాన్ , మున్సిపల్ కార్యాలయ సిబ్బంది వార్డు ప్రజలు శ్రీకాంత్ గౌడ్, నవీన్, సురేష్, పద్మ పాల్గొన్నారు.

---

## నర్సాపూర్ అర్బన్ పార్క్‌ను పర్యటించిన ట్రైనీ అధికారుల బృందం





నర్సాపూర్,అక్టోబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : మెదక్ జిల్లా నర్సాపూర్ పురపాలక సంఘానికి ట్రైనీ ఐపీఎస్. ఐఆర్ఎస్, ఐ ఎఫ్ఓయస్ అధికారుల బృందం వచ్చేచింది. రెండు రోజుల ట్రైనింగ్ లో భాగంగా నర్సాపూర్ పురపాలక సంఘానికి టచ్ చేసిన అధికారుల బృందానికి మున్సిపాల్ చైర్మన్ అశోక్ గౌడ్ రెండవ రోజు శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి డాక్టర్లను రోగులను అక్కడ జరుగుతున్న చికిత్సల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నర్సాపూర్ అర్బన్ పార్కును సందర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ మేనేజర్ మధుసూదన్ శానిటైజర్ ఇన్స్పెక్టర్ సల్ల మురళి వార్డ్ అధికారులు. ఎన్విరాన్మెంట్ ఇంజనీరింగ్ శ్రీకాంత్ సబ్ ఇంజనీరింగ్ భూపాల్ వాటర్ సప్లై ఇన్స్పెక్టర్ వినీత్ వాడు అధికారులు రాములు ఉదయ్ రణదీప్ జవాన్ వల్ల అశోక్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# పలు శుభకార్యాలకు హాజరైన పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి





నర్సాపూర్,అక్టోబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : పీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సాపూర్ నియోజకవర్గం ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి నాడు నర్సాపూర్ నియోజకవర్గంలో పలు శుభకార్యాలకు హాజరైనారు. వచ్చే దంపతులు ఎల్లప్పుడూ సుఖసంతోషాలతో ఉండాలని ఆయన ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్ పర్సన్ సుహాసిని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

---

# రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం పని చేస్తున్నది

- దామోదర్ రాజనర్సింహ, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి
- జోగిపేట మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి హాజరైన దామోదర్ రాజనర్సింహ.
- రైతుల సంక్షేమం కోసం పనిచేసి పాలకవర్గం రైతుల మెప్పు పొందాలి
- సన్న రకాలకు రాష్ట్ర ప్రభుత్వం 500 బోనస్ అందజేస్తోంది.
- లిబోనస్ ఇవ్వడం ద్వారా రైతుల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి





జోగిపేట,అక్టోబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : తెలంగాణ ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఆదివారం జోగిపేట వ్యవసాయ మార్కెట్ యార్డు నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి జాహిరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ శెట్కార్ తో కలిసి మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల ఆర్థిక అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నట్లు మంత్రి తెలిపారు. "రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది. గ్రామాలు అభివృద్ధి పథంలో ముందంజ వేస్తాయి" అని మంత్రి అన్నారు. సంగారెడ్డి జిల్లాపై ప్రత్యేక దృష్టితో జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని, ప్రతి రైతు అభివృద్ధి చెందేలా పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. జోగిపేట వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని దామోదర్ రాజనర్సింహ తెలిపారు. మార్కెట్ యార్డు పాలకవర్గం రైతుల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేసి, మార్కెట్ యార్డు కు పేరును తీసుకురావాలన్నారు. రాష్ట్రంలోని జోగిపేట మార్కెట్ యార్డుకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చేలా పాలకవర్గ సభ్యులు పనిచేయాలన్నారు. రైతుల ఆర్థిక స్థితిని మెరుగుపర్చడమే తమ పథకాల ప్రధాన లక్ష్యమని వివరించారు. రైతుల సంక్షేమం కోసం పలు పథకాలు అమలులో ఉన్నాయని మంత్రి వివరించారు. పంటలకు మద్దతు ధరను నిర్దేశించి రైతుల ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో 211 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులు కనీస ధరకు తమ పంటలను విక్రయించేలా సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. రైతులు తగిన ప్రతిఫలాన్ని పొందేలా ఈ చర్యలు ఉపయోగపడుతాయని అన్నారు. సంస్కరణలలో భాగంగా సన్న రకం ధాన్యాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచుతున్నామని మంత్రి వివరించారు. సన్న ధాన్యానికి క్వింటాలుకు రూ .500 రూపాయల బోనస్ ను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం ద్వారా రైతులకు ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు అవసరమైన విత్తనాలు మరియు ఎరువులు సకాలంలో అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పంటలు సాగు చేసేందుకు మార్కెట్ కమిటీలు విత్తనాలు, ఎరువులను సరఫరా చేయడంలో సహకరించాలని సూచించారు. రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు మార్కెట్ కమిటీలను మరింత బలోపేతం చేయాలని మంత్రి సూచించారు. రైతులకు అవసరమైన సేవలను సమర్థంగా అందించడంలో, ప్రభుత్వం, రైతులకు మధ్య వారధిగా వ్యవహరించడంలో మార్కెట్ కమిటీల పాత్ర ప్రాధాన్యతగలదని చెప్పారు. రైతులకు ఎటువంటి సమస్యలు రాకుండా కమిటీలు సమర్థంగా తమ విధిని నిర్వహించాలని అన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అంకితమై ఉందని, రైతుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే తమ ప్రధాన లక్ష్యమని మంత్రి చెప్పారు. రైతుల కోసం తీసుకొచ్చిన పథకాల ఫలాలు వారి జీవితాల్లో మార్పును తీసుకురావాలని ప్రభుత్వం సంకల్పించిందని వివరించారు. ఈ కార్యక్రమంలో జోగిపేట మార్కెట్ యార్డు అధికారులు, నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# కస్తూరిబా విద్యార్థులను పరామర్శించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ

- విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా
- విద్యార్థులకు మెరుగైన వైద్య సదుపాయం అందించాలని ఆదేశం



సంగారెడ్డి బ్యూరో,అక్టోబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : అస్వస్థతకు గురై సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న న్యాల్కల్ కస్తూరిబా గురుకుల విద్యార్థులను రాష్ట్ర వైద్య ఆరోగ్య మంత్రి దామోదర్ రాజానర్సిహా ఆదివారం పరామర్శించారు. న్యాల్కల్ మండలంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అస్వస్థత గురి కావడంతో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలిసిన వైద్య ఆరోగ్య మంత్రి దామోదర్ రాజానర్సిహా ఆసుపత్రిని సందర్శించి విద్యార్థులను పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి గురించి మంత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి వైద్యులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులకు ధైర్యాన్ని నూరిపోస్తూ, వారు త్వరగా కోలుకుంటారని ధైర్యం చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి, అధైర్యపడవద్దని, పిల్లలకు ధైర్యం చెప్పాలని అవసరమైతే ప్రైవేట్ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సౌకర్యం కల్పించనున్నట్లు ధైర్యం చెప్పారు ప్రభుత్వం విద్యార్థులకు అండగా ఉన్నదని భరోసా కల్పించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ కుమార్, విద్యార్థుల పరిస్థితిని మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

---

# విద్యార్థులు ఆరోగ్య పరిస్థితిపై ఆసుపత్రి లో వైద్యులతో కలెక్టర్ సమీక్ష

- పరిస్థితి విషమంగా ఉన్న విద్యార్థులను ప్రైవేటు ఆసుపత్రులకు తరలించడానికి ఏర్పాట్లు



సంగారెడ్డి బ్యూరో,అక్టోబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాలతో జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ఆదివారం సాయంత్రం సంగారెడ్డి జిల్లా ఆసుపత్రిని సందర్శించి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలంలోని కస్తూరిబా పాఠశాల విద్యార్థులు అస్వస్థతకు గురై సంగారెడ్డి జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఉండడంతో విషయం తెలిసిన మంత్రి ఆకస్మిక తనిఖీ నిర్వహించి విద్యార్థులను విద్యార్థుల తల్లిదండ్రులను పరామర్శించారు విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించడంతో కలెక్టర్ క్రాంతి వల్లూరు ఆసుపత్రిని సందర్శించి విద్యార్థులు విద్యార్థులు తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్యార్థుల పరిస్థితిపై వైద్యులతో సమీక్షించారు. విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. పరిస్థితి విషమంగా ఉన్న విద్యార్థులను వెంటనే మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించేలా ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ అనిల్ కుమార్ వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

---

# హాస్టల్ విద్యార్థులను పరామర్శించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్



సంగారెడ్డి బ్యూరో,అక్టోబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : అస్వస్థతకు గురై సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న న్యాల్కల్ మండలం కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థులను ఆదివారం ఎమ్మెల్యే చింత ప్రభాకర్ డీసీఎంఎస్ చైర్మన్ శివ కుమార్ పరామర్శించారు. కస్తూర్బా గాంధీ హాస్టల్ లో 10 మంది విద్యార్థులకు అసశ్వాస్తకు గురై బాధపడుతున్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థిని తెలుసుకొని వారికి మెరుగైన వైద్యం అధించాలని డాక్టర్లకు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆదేశించారు. అధైర్యపడొద్దని విద్యార్థులకు , విద్యార్థుల తల్లి తండ్రుల కు ధైర్యం చెప్పారు. అవసరమైతే మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అధించాలని కోరారు. ఎమ్మెల్యే వెంట. మాజీ సి డి సి చైర్మన్ బుచ్చిరెడ్డి, పట్టణ అధ్యక్షులు ఆర్ వెంకటేశ్వర్లు, డా శ్రీహరి, ఝరసంఘం మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం, నరసింహ గౌడ్, మాజీ జెడ్పిసి కొండల్ రెడ్డి, శ్రవణ్ రెడ్డి, రాజేందర్ నాయక్, తదితరులు ఉన్నారు.

# పేదల బతుకులతో రాజకీయాలు చేయొద్దు

- రాష్ట్ర కార్మిక నాయకులు వి.వరప్రసాద్ రెడ్డి
- నిరాహార దీక్ష విరమణ






ఐ డి ఏ బొల్లారం,అక్టోబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : పేదల బతుకులతో రాజకీయాలు చేయవద్దంటూ రాష్ట్ర కార్మిక నాయకులు వి.వరప్రసాద్ రెడ్డి అన్నారు. ఆదివారం బొల్లారం మున్సిపాలిటీ కొత్త బస్టాండ్ ప్రాంగణంలో పేద ప్రజలకు మద్దతుగా మాజీ ఎంపీటీసీ కృష్ణంరాజు, మాజీ వార్డు సభ్యులు భాస్కర్ చేపట్టిన నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ మేరకు పేద ప్రజలు ధైర్యంగా ఉండాలని భరోసా కల్పిస్తూ దీక్షకు దిగిన నాయకులను మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పి.జైపాల్ రెడ్డి గారితో కలిసి నిమ్మరసం తాగించి విరమింప చేశారు. అనంతరం వి.వరప్రసాద్ రెడ్డి గారు మాట్లాడుతూ... గత వారం రోజులుగా మున్సిపాలిటీలో హైడ్రా భయంతో పేద ప్రజలు తమ గృహాలను కోల్పోతామేమోనని భయాందోళన చెందుతున్నారు. మార్కింగ్ చేసిన గృహాలు హైడ్రా కూల్చివేస్తుందేమోనని ఆందోళన వ్యక్తం చేస్తూ ఈ క్రమంలోనే దీక్షకు దిగారని స్పష్టం చేశారు. బతుకుదెరువు నిమిత్తం 30 సంవత్సరాల క్రితమే వచ్చి నివసిస్తున్న పేదలకు తమను సంపూర్ణంగా అండగా ఉంటామన్నారు. ఎవరు ఎన్ని జిమ్మిక్కులు చేసిన పేద ప్రజలకు అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకోమన్నారు. అవసరమైతే న్యాయబద్ధంగా పోరాడటానికి కూడా సిద్ధమన్నారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు పేద ప్రజలకు చేస్తున్న అన్యాయాలను ప్రతి ఒక్కరు గమనిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే పేదల బ్రతుకులతో ఆడుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. రాజకీయాలు చేసుకోవాలంటే చాలా విషయాలు ఉన్నాయన్నారు. కానీ పేదల బతుకులు అడ్డంగా పెట్టుకొని రాజకీయాలు చేస్తే సహించేది లేదన్నారు. దీక్షలో పాల్గొన్న నాయకులకు, పేదలకు నియోజకవర్గ ఇన్చార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ గారు ఫోన్లో మాట్లాడి భరోసా కల్పించారు. మంత్రులతో మాట్లాడి హైడ్రా రాకుండా చూస్తామని తెలిపారు. వారి సూచన మేరకు స్థానిక నాయకులు ఇచ్చిన నిమ్మరసాన్ని స్వీకరించి దీక్షను విరమించారు. ఏ ఒక్కరికి ఎటువంటి నష్టం జరగకుండా చూస్తామని స్థానిక నాయకులు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గోపాలమ్మ, మాజీ ఎంపీటీసీ కృష్ణంరాజు, మాజీ వార్డ్ మెంబర్ టి.భాస్కర్ , చంద్రారెడ్డి, వెంకటయ్య, రమేష్ రెడ్డి, బషీర్, దీననాథ్, లకన్ సింగ్, శ్రీనివాస్, తీవారీ, నవీన్, మహిళలు, ఆటో యూనియన్ నాయకులు, కార్యకర్తలు, పేద ప్రజలు పాల్గొన్నారు.

---

# మరిన్ని నిధులు ఇవ్వండి ముఖ్యమంత్రి ని కోరిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి



నారాయణఖేడ్,అక్టోబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : నారాయణఖేడ్ ప్రాంతాన్ని మరిన్ని నిధులు ఇచ్చి ప్రాంత అభివృద్ధికి సహకరించాలని నారాయణఖేడ్ శాసనసభ్యులు సంజీవరెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఆదివారం హైదరాబాద్ ముఖ్యమంత్రి కార్యాలయంలో రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. మొదటి లిస్టులోనే ఖేడ్ ప్రాంతానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా మా ప్రాంతానికి అనేక నిధులు ఇచ్చి అభివృద్ధికి తోడ్పాటు అందించగలదని కోరారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ శాసనసభ్యులు యేన్నం శ్రీనివాస్ రెడ్డి, జడ్చర్ల శాసనసభ్యులు అనూరుద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కన్నీళ్ల సాగరం

## మల్లారెడ్డి రాసుకున్న... మరణ శాసనం!

అది గజ్వేల్ మండలంలోని పిడిచేడు గ్రామం. సాయంత్రం అయిదు గంటలవుతోంది. కొన్ని రోజులుగా తన చిన్నకూతురు దగ్గర ఉంటున్న తూటుకూరి మల్లారెడ్డి మనసంతా ఏదోలా ఉంది. కడుపున పుట్టిన ముగ్గురు ఆడపిల్లల దయనీయ స్థితిని తలచుకుంటూ ఆవేదన చెందుతున్నడు. 'పెద్ద బిడ్డ, అల్లుడు చనిపాయె. రెండో బిడ్డ భర్తను కరోనా కాటేసె. చిన్న బిడ్డ సంసారం అంతంతమాత్రమేనాయె. ఇట్లాంటి పరిస్థితులల్ల ఊరు గూడ మునిగిపోవట్టె. తనకో ఇల్లయిన ఇస్తే చిన్న బిడ్డకు ఇద్దామనుకున్నా.. అదీ కుదిరేటట్లు లేకపోయే. ఇన్నేండ్లు ఉన్న ఊర్ల తనను ఒక మనిషి లెక్క గుర్తించకపోతుంటురి. కడదాక తోడుంటానని బాస చేసిన భార్యను క్యాన్సర్ పొట్టన బెట్టుకునె. ఆ దేవుడు పగ బట్టినట్లే ఉన్నడు మా మీద' అనుకున్నడు మల్లారెడ్డి.

అట్ల ఆలోచిస్తూనే 'ఇగో భాగ్యమ్మా... నేను మన ఊరు దాక పోయొస్త. టిఫిన్ల అన్నం పెట్టియ్యి' అంటూ చిన్నబిడ్డకు చెప్పిండు. 'గిప్పుడు ఊర్లకు ఎందుకు నాయినా.. ఆడ ఒకరిద్దరు తప్ప ఎవలు లేరు. ఈడనే ఉండు. ఆడికి పోయి మనసు పాడు చేసుకోకు' అంటూ తండ్రిని వెళ్లకుండా ఆపే ప్రయత్నం చేసింది భాగ్యలక్ష్మి. 'ఏం కాదు తియ్యమ్మా.. పొయ్యొస్త... మల్ల మల్ల పోవాల్నంటె కూడ పోలేంగా.. కొన్ని దినాలయితే నీళ్లల్ల మునిగిపోతది' అంటూ బిడ్డకు నచ్చజెప్పే ప్రయత్నం చేసిండు. ఆఖరుకు ఆమె పెట్టిచ్చిన టిఫిను డబ్బ తీసుకున్నడు. పోతూ పోతూ ఓ మాటన్నడు.. 'భాగ్యా.. వానొచ్చెటట్లుంది. నేను ఆడ్నే ఉంట. నాకోసం ఎదురుచూడకు' అంటూ వేములఘాట్ దిక్కు సాగిపోయిండు.

ఆటో ఎక్కి ఊరిదిక్కుపోతున్నడు మల్లారెడ్డి. దూరంగా మల్లన్నసాగర్ కట్ట కన్పిస్తోంది. 'ఒకప్పుడు ఎట్లుండె మన ఊరు. నిండా జనాలతో .. సందడి సందడిగ ఉండేది. జనం తీరిక లేకుండ పొలం పనులల్ల నిమగ్నమయ్యేటోళ్లు. దూరం నుంచి చూస్తుంటే ఇప్పుడు స్మశానంలా కనిపిస్తోంది' అనుకున్నడు. ఆటో ఊరికి దగ్గరగ పోయ్యేకొద్దీ అతడి మనసులో ఆలోచనల సుడులు తిరుగుతున్నయి. అట్ల అనుకుంటుండంగనే ఊరు దగ్గరగా దాక వచ్చింది ఆటో. ఎక్కడ చూసినా నిశబ్దం. చాలా ఇండ్లు కూలిపోయి కనిపించాయి.

మనుషుల అలికిడే లేదు. ఒకటి రెండు కుక్కలు సగం కూలిన అరుగుల మీద కూసున్నయి. మొన్నటి దాక జనాలతో ఉన్న ఊర్ల.. అలికిడి కనిపించకపోయేసరికి పక్షులు విచిత్రమైన అరుపులు అరుస్తున్నయి. ఊరి మొదట్లోనే ఆటో దిగిండు మల్లారెడ్డి. 'ఏం పెద్నాయినా.. ఇల్లు మొన్ననే ఖాళీ చేసిపోతిరిగా. మల్ల ఇయ్యాల వచ్చినవేందే'... కిరాయి తీస్కుంటూ అడిగిండు ఆటో డ్రైవరు. ఏం లేదు బిడ్డా.. పుట్టి ఇంత వయసొచ్చేదాక ఉన్న ఊరుగా.. చివరి సారి సూస్కొని పోదామన్పించింది.. అంతే' అంటూ చెప్పి తమ ఇంటి వైపు అడుగులేసిండు మల్లారెడ్డి.

అప్పటికే ఒకటిరెండు ఇండ్లోళ్లు తప్ప అందరూ ఖాళీ చేసి వెళ్లిపోయిర్రు. తమ ఇంటి పక్కనే ఉన్న గొల్లోల్లు ఇంకా ఉన్నరు. ఆటో దిగి నేరుగ ఆల్లింటికే పోయిండు. 'ఏం తాతా.. ఇట్లొచ్చినవ్.. మొన్ననే సామాన్లన్నీ తీస్కపోయిర్రుగా' అంటూ అడిగిండు ఆ పిలగాడు. 'అవునోయ్.. కానీ మా ఇంటిని.. ఈ ఊరిని సూడబుద్దయింది. అందుకే ఒచ్చిన' అని అన్నడు. అట్లా అని ఆళ్ల ఇంటి ఆరుగు కాడనే కూసుకొని టిఫిను డబ్బా కింద పెట్టిండు. 'ఏం బతుకులో మనవి. మనుసులుగ గూడ గుర్తిస్తలేరు. ఇడ్నే పుడితిమి. ఇడ్నే పెరిగితిమి. ఈ మట్టిల్నే కలిసి పోతమనుకుంటిమి. మల్లన్నసాగర్ పేరు జెప్పి మన బతుకులు ఆగంజేసిర్రు బిడ్డా' అంటూ ఆవేదనగా అన్నడు. ఒకప్పుడు ఈ ఊరు ఎట్ల ఉండె అనుకుంటూ గతం గుర్తు చేసుకున్నడు.

మల్లారెడ్డి వయసు 70 ఏళ్లు. పుట్టినకాడి సంది ఈ ఊర్లనే ఉన్నడు. భార్య అమృతమ్మతో కలిసి ఉన్న రెండెకరాలల్ల ఎవుసం చేస్తుండె. కడుపున పుట్టిన ముగ్గురు ఆడపిల్లల బతుకులు బాగుంటే సాలనుకున్నరు. అంతకుమించి తమకు ఆస్తులేం అక్కర్లేదని అనుకునేటోళ్లు భార్యాభర్తలిద్దరు. కాయాకష్టం చేసి, రెక్కలు ముక్కలు చేస్తోని ముగ్గురు పిల్లలను సాదిర్రు. పెద్దబిడ్డను లింగారెడ్డిపల్లిల ఉండె భగవాన్ రెడ్డికిచ్చి పెళ్లి చేసిండు. కొడుకులు లేకపోవడంతో అల్లుడ్ని ఇల్లరికం తెచ్చుకున్నడు. ఆ మరుసటి ఏడే చిన్న బిడ్డను పొరుగున ఉన్న ఏటిగడ్డ కిష్టాపూర్ ఇచ్చిండు. గావురంగ పెంచుకున్న చిన్న బిడ్డ భాగ్యకు ఒక ఇంటికి ఇచ్చిండుగానీ.. పేద కుటుంబం కావడంతో ఆమె గురించే రంది పడేటోడు. అట్ల రోజులు గడుస్తున్నయి. ఒకరెనుక ఒకరుగ పెద్ద అల్లుడు, బిడ్డ చనిపోయె. మనవడు తిరుపతిరెడ్డిని అన్నీ తామై పెంచిర్రు. చిన్న బిడ్డ సంసారం బాగలేకపోవడంతో ఉన్నదాంట్లనే ఆళ్లకు కొన్ని పైసలు పంపించేటోళ్లు. రెక్కల కష్టాన్నే నమ్ముకున్న మల్లారెడ్డి ఎన్నటికయినా తమ కష్టాలు తీరకపోతయా అంటూ కాలం ఎల్లదీస్తుండు.

తెలంగాణ వొచ్చినంక రెండేండ్లకే పిడుగులాంటి వార్త మల్లారెడ్డి చెవిన పడ్డద్ది. 'ఈడ మల్లన్నసాగర్ కడ్తరంట. ఇండ్లు, భూములు అన్ని నీళ్లల మునుగుతయంట. మన ఊరిడిసి పోవద్దదంట' అంటూ పక్కింటి యాదయ్య చెబుతున్న మాటలు విని ఒక్కసారిగ కాళ్ల కింద భూమి కదిలినట్లు అనిపించింది మల్లారెడ్డికి. 'అదేంది.. ఊరిడిసి ఏడికి పోతం. గిన్ని ఊర్ల పెట్టి సముద్రం లెక్కన గా ప్రాజెక్టేంది' అంటూ మదన పడ్డడు. ఆ బాధల నుంచి తేరుకునేలోపే అధికారులు రావడం, ఎకరాకు ఆరులక్షల రూపాయలు ఇస్తామని చెప్పడం చూస్తుండంగనే జరిగిపోయినయి. ఆటితో పాటు కూలగొట్టిన ఇండ్లకు మాత్రమే పైసలిస్తమని కూడ చెప్పిర్రు. దీంతో నిర్వాసితులవుతున్న 14 గ్రామాల ప్రజలు ఎదురుతిరిగిర్రు. భూసేకరణ చట్టం %-% 2013 ద్వారానే పరిహారం ఇవ్వాలని పోరాటం చేసిర్రు. చివరకు ప్రభుత్వం దిగొచ్చింది. ప్యాకేజీలు ఇవ్వడంతో పాటు పునరావాసం కల్పించేందుకు అయిష్టంగానే అంగీకరించింది.

'సార్.. నేను, నాభార్య, మనువడు ఉంటాం. మా ఇద్దరికి ప్యాకేజీతో పాటు నా మనవడికి కూడా ప్యాకేజీ ఇయ్యండి' అంటూ లెక్కలు రాసుకోనికి వచ్చిన ఆఫీసరుతో అన్నడు మల్లారెడ్డి. సరే అంటూ ఆ సమాచారాన్ని తీసుకున్న అధికారి.. 'ఇగో నీ మనవడికి సపరేటు, మీకు సపరేటుగా ఇండ్లిస్తం. ఇల్లు వద్దంటే రూ.5.04లక్షలు అందిస్తం. ఏది కావాలి' అంటూ అడిగిండు. 'మా ఇద్దరికి ఇల్లే కావాలి' అంటూ రాపిచ్చిండు మల్లారెడ్డి. ఊరు పోతోంది. ఎట్ల బతుకుడో ఏందో అనుకున్నడు. దినాం ఆఫీసర్లు వచ్చుడు. లెక్కలు రాస్కుంట పోవుడు. మా వివరాలు రాస్కోలేదని ఊర్ల ఎవరో ఒకలు లొల్లి పెట్టడం.. ఇదో తంతయిపోయింది. ఏదన్న విషయం అర్థంకాక అడుగుదామంటే 'ఎన్నిసార్లు చెప్పాలె మీకు.. ఒకసారి చెప్తే అర్థంకాదా.. మాకింకే పనిపాటు లేదా' అంటూ గయ్యుమని ఇంతెత్తు ఎగురుతున్నరు ఆఫీసర్లు. 'ఊరు పోతుండె. బతుకులు ఆగమయిపోతుండె. మనువడికి ఒక ఇల్లు వచ్చి... నాకోటి వస్తే.. దాన్ని నా చిన్నబిడ్డకయిన ఇస్త. ఆళ్ల పరిస్థితి మరీ అధ్వానంగ ఉండె' అనుకున్నడు మల్లారెడ్డి.

'కట్ట పనులు వేగంగ జరుగుతున్నయి. ఇంకొన్ని దినాయిలయితే ఊరిడిసి పోవాల్సి వస్తది. ముట్రాజ్ పల్లి కాడ ఇండ్లు కట్టిస్తున్నరంట. ఇగ ఊరు ఖాళీ చేస్తే ఆడికిపోయి ఉండక తప్పదు' అనుకున్నడు మల్లారెడ్డి. మనవడితో పాటు తనకూ ఇల్లు వస్తే ఇద్దరాలుమొగలం చిన్న బిడ్డతో కలిసి ఉండొచ్చనుకున్నడు. అట్ల కొంత మనసు నిమ్మలం చేసుకున్నడు. అట్లాంటి టైంల తన భార్య అమృతమ్మకు సుస్తి చేసింది. సిద్దిపేట తీస్కెళితే హైదరాబాద్ పొమ్మన్నరు. తీరా ఆడికి పోయినంక పదిరకాల పరీక్షలు చేసి క్యాన్సర్ వచ్చిందని చెప్పిర్రు. మల్లారెడ్డికి ఏం అర్థం కాలే. మొన్నటి దాక మంచిగున్న తన భార్యకు క్యాన్సరేందని అనుకున్నడు. ఆ తర్వాత చికిత్స కోసం ఆస్పత్రుల చుట్టూ తిప్పిండు. భూమి పోగా వచ్చిన పరిహారం మొత్తం హాస్పటల్లకే అయిపోయింది. మీద నుంచి ఇంకొన్ని అప్పులు చేసిండు. అయినా తగ్గలేదు. విషయం తెల్సిన చిన్న బిడ్డ కుటుంబంతో సహా వేములఘాట్ కు వచ్చింది. తల్లికి సేవలు చేసింది. అట్ల ఎనిమిదినెలలు రాచపుండుతో నవిశిన అమృతమ్మ 2020లో సచ్చిపోయింది. 'ఇంకొన్ని దినాలయితే ఈ ఊరు విడిచిపోయేటోళ్లం. ఈలోగ నా భార్య లోకాన్నే ఒదిలెల్లింది. ఈ మట్టిలనే కలిసిపోయింది' అని అనుకున్నడు మల్లారెడ్డి.

అమృతమ్మ దినాలు చేసింద్రు. నెలమాషికం కూడ అయిపోయింది. అంతల్నే ఆఫీసర్లు వచ్చిర్రు. మరోసారి సర్వే చేసిర్రు. 'మేం మీ మనువడి ఒక్కడికే ఇల్లిస్తం. నీ భార్య ఇప్పుడు లేదు.. నువ్వు ఒంటరివి. నువ్వు మనువడితో ఉండు. నీకు ఇల్లు రాదు' అంటూ ఆఫీసర్లు చెబుతుంటే పానం పోయినంత పనైంది మల్లారెడ్డికి. 'అదేంది సారూ.. మాకు కూడ ఇస్తనంటిరి. ఇప్పుడేమో ఒంటరోడంటున్నరు. ఇదేంది.. ఇది న్యాయం కాదు. ఆ ఇల్లిస్తే నా చిన్న బిడ్డ బతుకుతది. మాకు అన్యాయం చేయకండి' అంటూ ప్రాధేయపడ్డడు. 'మా చేతులల్ల ఏముంది. రూల్స్ అట్లున్నయి... ఒంటరిగ ఉన్న ముసలోళ్లకు ఇండ్లు ఇస్తలేదు ప్రభుత్వం' అంటూ తెగేసి చెప్పిండు ఆఫీసరు. ఆ మాటలతో మల్లారెడ్డికి ఏం చేయాలో తోచలేదు. గావురంగ సాదుకున్న బిడ్డకు ఏమీ ఇయ్యలేకపోతున్ననే... చేతిలున్న డబ్బులున్నీ దవాఖానాలకే సరిపాయె' అంటూ వేదన చెందిండు.



'సారూ... మాకు అన్యాయం చేయకుండి. నాకు కూడ ఇల్లియ్యండి. నా బిడ్డ సంసారం బాగలేదు. మీ కాళ్లు మొక్కుత. మా బతుకులు ఆగం జేయకండి' అంటూ తహసీల్దారు దగ్గర నుంచి కలెక్టరు వరకు అందరినీ బతిలాడిండు. 'నీ ఒక్కడికి రూల్స్ సపరేటుగ ఉంటయా.. అట్లేం కుదరదు. నీ మనువడి ఒక్కడికే ఇల్లొస్తది. నీకు రాదు.. పో... పో.. ఇంకోసారి రాకు' అని ఈసడింపులే ఎదురయినయి. తన పేరు మీద ఇల్లు రాదని తెల్సినప్పటి నుంచి మల్లారెడ్డి ఏదోలా అయిపోయిండు. చిన్న బిడ్డ భాగ్యమ్మకు ఏమీ ఇయ్యలేకపోతున్ననే అంటూ మదన పడ్డడు. ఇదే ముచ్చట బిడ్డతో చెప్పి మస్తుగ బాధపడ్డడు. 'నాయినా..గా దేవుడు మన రాతలిట్ల రాసిండేమో... నువ్వేం బాధపడకే. ఎట్లయితే గట్లయితది' అంటూ కన్నీళ్లు పెట్టుకుంది. అయినా మల్లారెడ్డి ప్రయత్నం ఆపలేదు. కనిపించిన ఆఫీసరునల్లా బతిలాడిండు. రోజు సర్పంచు దగ్గరకు పోయి తమ బాధ చెప్పుకున్నడు. అయినా కరకు గుండెలు కరగవనే విషయం తెల్సుకోలేకపోయిండు.

మల్లన్నసాగర్ కట్ట పూర్తికావొచ్చింది. కొన్ని దినాలల్ల నీళ్లు కూడా నింపేందుకు పనులు జరుగుతున్నయి. ఆఫీసర్లు ఊర్లకు వచ్చి ఒక్కొక్కరిని ఖాళీ చేయించండం మొదలుపెట్టిర్రు. చేసేందేమీ లేక మల్లారెడ్డి కూడా తను కట్టుకున్న ఇంట్ల సామాన్లన్నీ తీస్కపోయిండు. పిడిచేడుల చిన్న బిడ్డ దగ్గర ఉన్నడు. కొన్ని రోజులయితే మళ్లీ ఊరు కనిపించదని చెప్తూ రెండు మూడు రోజులకోసారి వేముల ఘాట్ పోయ్యొస్తుండు. ఆ దినం కూడ తన తండ్రి అట్లనే పోయి వస్తడనుకుంది భాగ్యమ్మ. ఎంట తీస్కపోయిన టిఫిను డబ్బ తిని.. రాత్రి 11 గంటల వరకు గొల్లోళ్ల ఇంటికాడ ముచ్చట్లు పెట్టిన మల్లారెడ్డి కూలిపోయిన తన ఇంటికిపోయిండు. ఎప్పటిలెక్కనే ఆ పెద్దమనిషి తనింట్ల పడుకుంటడని అనుకున్నారు పక్కింటోళ్లు. మల్లారెడ్డి ఎల్లిపోంగనే దర్వాజ పెట్టుకొని నిద్రపోయిర్రు.

ఎంతో శ్రమకోర్చి కట్టుకున్న ఇల్లది. గోడలు సగం వరకు కూలిపోయినయి. వాసాలు ఏడ పడితే ఆడ పడిపోయి కనిపించినవి. ఏమనుకున్నడో ఏమో ఆటన్నింటినీ ఒకచోట పేర్చిండు. జేబులున్న ఫోన్ నంబర్ల బుక్ గొళ్లానికి తగిలించిండు. చేతిలున్న సంచిల నుంచి కొబ్బరికాయ తీసిండు. కడప మీద కొట్టిండు. పిడిచేడు నుంచి వస్తూ వస్తూ ఒక పెద్ద డబ్బ నింద ఎవరి కంట పడకుండా తెచ్చిన పెట్రోలు డబ్బ బయటకు తీసిండు. 'అమృతమ్మా... ఇన్నేండ్ల సంది ఈ ఊర్లున్నా నన్ను మనిషిగ గూడ గుర్తించకపాయె. నా పేరు మీద ఇల్లోటి ఇస్తరనుకుంటె.. నువ్వు లేవని జెప్పి అది కూడ ఎగ్గొట్టిరి. ఆ ఇల్లొస్తే కష్టాల్లో ఉన్న మన చిన్న బిడ్డకు జరంత నిమ్మలమయితదనుకుంటే.. అదీ లేకుండా పోయే. నేను గూడ నీకాడికే వస్తున్న' అంటూ కుప్పగ పోసిన వాసాల దిక్కు నడిసిండు. తన ఇంటి వాసాలతోనే తనే చితిపేర్చకుండు. కనుగుడ్ల నిండ నీళ్లు దీస్కుంటూ... చితి చుట్టూ తిరిగిండు. వాసాలన్నీ తడిసెటట్లు పెట్రోలు పోసిండు. చితి మీద పడుకొని తనకు తానే నిప్పంటించుకుండు. కణకణ మండుతున్న అగ్ని దహించివేస్తున్నా ఒక్క అరుపు కూడ అరవలేదు.

ఉదయం 4 గంటలు కావొస్తోంది. మల్లారెడ్డి పక్కింట్ల ఉన్న గొల్లోళ్ల పిలగాడు నిద్రలేసిండు. మల్లారెడ్డి ఇంట్ల నుంచి పొగ వస్తున్నట్లు కనిపెట్టిండు. అదేందో చూద్దామని అటు దిక్కు పోయిండు. చితిలో కాలిపోయిన పుర్రె కనపడేసరికి ఒక్కసారిగా కేకపెట్టిండు. 'మల్లారెడ్డి తాత చితి పేర్చుకొని సచ్చిపోయిండు' అంటూ గట్టిగా అర్సిండు. క్షణాల్లో విషయం పోలీసులకు తెలిసిపోయింది. అప్పటి వరకు ఖాళీగ ఉన్న ఊరంతా పోలీసుల బూట్ల సప్పుడుతో దద్దరిల్లింది. నాయిన సచ్చిపోయిన విషయం తెల్సి భాగ్యలక్ష్మి పరుగు పరుగున ఊరికి వచ్చింది. తండ్రిని సూడాలని తపించింది. 'ఇగో మీ నాయిన కాలి బూడిదయ్యిండు. ఆడికిపోయినా సూడ్డానికేం లేదు. ఆ దగ్గరి వరకు ఎవరినీ పోనియొద్దని పెద్ద సార్లు చెప్పిర్రు. దూరం నుంచే సూడుండ్రి' అంటూ ఒక పోలీసాయన భాగ్యను, ఆమె భర్తను కాస్త దూరం వరకు తీస్కపోయిండు. దూరంగా బూడిద... అందులో నుంచి కొంచెం కొంచెంగా వస్తున్న పొగలు కనిపించాయి. ఒక్కసారి ఉరికి ఆ బూడిదను ముట్టుకోవాలని ప్రయత్నించింది. అప్పటికే అక్కడ సిద్దంగా ఉన్న మహిళా కానిస్టేబుళ్లు ఆమెను అక్కడి నుంచి లాగి పడేశారు.

'కనిపెంచిన నాయిన చనిపోతే కూడ సూడనిస్తలేరు. ఆదరబాదరగా పంపించేస్తున్నరు. ఊరోళ్లను ఒక్కరిని కూడ ఈడికి రానిస్తలేరు. ఎట్ల న్యాయమైతది' మీకు అంటూ భోరున ఏడ్చింది భాగ్యమ్మ. అంతల్నే ఆమె పక్కనే ఉన్న మహిళా పోలీసులు.. 'లే.. లే.. ఈడ్నుంచి పోవాలె' అంటూ ఆమె రెక్కలు లాగి గుంజినంత పనిచేసినరు. 'తండ్రి సచ్చిపోతె కూడా మనసార ఏడ్వలేని బతుకులైపాయె' అంటూ బూడిదగా మారిన నాయినను చూస్తూ గుండెలు పగిలేలా రోదిస్తూ పోలీసుల వెంట నడిచింది మల్లారెడ్డి చిన్న కూతురు భాగ్యలక్ష్మి.

Printed,Published and owned by baindla Srinivas,Madava nagar,Sangareddy-502001,Telangana State,
Phone No. 9032793832 Mail id:methukuseemanews@gmail.com